క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం టౌన్: మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 4 ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో సుశీలాదేవి బుధవారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. 2024 జూలై ఒకటో తేదీ నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్లలోపు వయసుండి, గ్రామ/వార్డు సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ నోటిఫైడ్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, మినీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి అభ్యర్థిని లేకపోతే 9వ తరగతి విద్యార్హతను పరిగణలోకి తీసుకుంటామన్నారు. అలాగే నోటిఫైడ్ కేంద్రాలకు 21 ఏళ్లు నిండిన అభ్యర్థిని లేకపోతే 18 ఏళ్లు నిండిన వారి దరఖాస్తులు అంగీకరిస్తామని పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలించిన సబ్ కలెక్టర్



రావిపాడు గ్రామ పటాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

కంభం: మండలంలోని రావిపాడులో ఆర్‌అండ్‌బీ రహదారి కుంచించుకుపోతోందని ఫిర్యాదు అందిన నేపథ్యంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ బుధవారం తహసీల్దార్ కిరణ్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. రోడ్లపైకి మెట్లు కట్టుకోవడం, కొన్ని చోట్ల ముందుకు వచ్చి నిర్మాణాలు చేసుకోవడంతో గ్రామంలో స్కూలు బస్సులు, ఇతర పెద్ద వాహనాలు మలుపుకోవడానికి ఇబ్బందికరంగా ఉందని స్థానికులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామపటంలో ఉన్న రోడ్డు వెడల్పు, ఇతర వివరాలను సబ్ కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు తెలియజేశారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ గ్రామస్తులకు స్పష్టం చేశారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

కంభం: అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి గ్రామంలో బుధవారం ఓ మహిళ నివాసాన్ని తనిఖీ చేయగా 8 క్వార్టర్ బాటిళ్లు లభ్యమయ్యాయని కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితురాలు డి.అల్మారమ్మను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మద్యం విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

శిక్షణకు సర్పంచ్‌లు డుమ్మా



సర్పంచ్‌లు లేకుండానే నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గత రెండు రోజులుగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు డుమ్మాకొట్టారు. మండలంలోని సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, విలేజ్ సర్వేయర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట సమయంలో అరకొరగా వచ్చిన సర్పంచ్‌లు సంతకం పెట్టి వెళ్లిపోయారు. సర్పంచ్‌లు లేకుండానే మిగిలినవారికి ఎంపీడీఓ ఎ.రంగనాయకులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

పశ్చిమ ప్రకాశాన్ని జిల్లాగా ప్రకటించాలి

మార్కాపురం: మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించడంతోపాటు మెడికల్ కాలేజీ నిర్మాణానికి కేంద్రం నిధులిచ్చేలా చూడాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు మార్కాపురం బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు తెలిపారు. మంత్రి యర్రగొండపాలెం వచ్చిన సందర్భంగా బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, ఆర్ఆర్ ప్యాకేజీ అమలు చేయడంతోపాటు గతంలో చంద్రబాబు నాయుడు మార్కాపురాన్ని జిల్లా చేస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చేలా చూడాలని కోరామన్నారు. మంత్రిని కలిసిన వారిలో శిరసనగండ్ల శ్రీనివాసులు, అంజనేయులు, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

నేడు పొదిలి, గిద్దలూరులో డయల్ యువర్ డీఎం

పొదిలిరూరల్: పొదిలి ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.సుందరరావు తెలిపారు. పొదిలి డిపో పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి మండలాల ప్రయాణికులు 9959225700కు ఫోను చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలని కోరారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం బి.చంద్రశేఖర్ తెలిపారు. ఆర్టీసీ పరంగా ఎటువంటి సమస్యలు ఉన్నా 9959225702కు ఫోన్ చేయాలని బుధవారం ఓ ప్రకటనలో సూచించారు.

కష్టం నీటిపాలు.. రైతన్నకు కన్నీళ్లు

బేస్తవారిపేట మండలంలోని ఆర్.కొత్తపల్లెలో గంపసాని వెంకటేశ్వర్లు, పండగాని రామయ్య, అల్లూరయ్య, ఆర్ నాగిరెడ్డి, చిన్నపుల్లారెడ్డి, ఎం.శ్రీను, ఎం.పుల్లయ్య, ఆర్.నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, చిన్నకాశిరెడ్డి 40 ఎకరాల్లో సాగు చేసిన పప్పుశనగ పూర్తిగా కుళ్లిపోయింది. ఈ గ్రామంలో సాగు చేసిన శనగ మొత్తం 50–75 శాతం మేర దెబ్బతింది. మొన్నటి వరకు పచ్చగా కనిపించిన పంట.. నేలలో తేమ ఆరేకొద్దీ ఎండుముఖం పడుతోంది. అకాల వర్షాల కారణంగా 5 ఎకరాల్లో శనగ దెబ్బతిని రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని రాచర్ల మండలం గంగంపల్లెకు చెందిన రైతు ఎద్దుల పుల్లారెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. గిద్దలూరు నియోజకవర్గంలో శనగ రైతులందరిదీ ఇదే పరిస్థితి.

పప్పుశనగ రైతులను నిండా ముంచేసిన ఫెంగల్ తుఫాన్

- గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 4 వేల ఎకరాల్లో పంట నష్టం
- ఉరకెత్తిన పొలాల్లో పంట మొత్తం ఎండుముఖం పడుతున్న వైనం
- ఎకరాకు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతుల ఆవేదన
- పంట నష్ట పరిహారం మంజూరుపై నీలినీడలు



కొత్తపల్లెలో పూర్తిగా కుళ్లిపోయిన పప్పుశనగ పంటను చూపుతున్న రైతులు



పూసలపాడులో వర్షాలకు కుళ్లిపోయిన పప్పుశనగ పంట

బేస్తవారిపేట:

ఫెంగల్ తుఫాన్ పప్పుశనగ రైతులకు తీవ్ర నష్టం, తీరని వేదన మిగిల్చింది. ఎడతెరపి లేకుండా వర్షాలు పడటంతో పొలాలను ముంచెత్తిన నీరు పంటలను ఉరకెత్తేలా చేసింది. రైతులు ఆందోళన చెందినట్టుగానే పప్పుశనగ పంట కుళ్లి, పనికిరాకుండా పోయింది. వర్షాలు తగ్గి, పొలాల్లో తేమ ఆరేకొద్దీ పంట ఎండుముఖం పడుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేస్తవారిపేట మండలంలోని ఆర్.కొత్తపల్లె, పూసలపాడు గ్రామాల్లో దాదాపు 120 ఎకరాల్లో పప్పుశనగ పంట వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గిద్దలూరు మండలంలోని అంబవరం, వెల్లుపల్లె, సంజీవరాయుడుపేట, ముండ్లపాడు, ఓబులాపురం, ఉయ్యాలవాడ, కె.ఎస్.పల్లె తదితర గ్రామాల్లో సుమారు 1800 ఎకరాల్లో పప్పు శనగ దెబ్బతింది. రాచర్ల మండలంలోని అనుములవీడు, గౌతవరం, అనుములపల్లె, గంగంపల్లె, రాచర్ల గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. కొమరోలు మండలంలో మండలంలో పప్పుశనగ పంట మూడొంతులకు పైగా దెబ్బతింది. ఈ మండలంలోని పలు గ్రామాల్లో 300 ఎకరాల్లో ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన శనగ విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో కురిసిన వర్షం.. అరకొరగా మొలిచిన మొక్కలను కూడా తుడిచిపెట్టేసింది. కంభం, అర్ధవీడు మండలాల్లోనూ శనగ రైతులు నష్టపోయారు.

పెట్టుబడి నీటి పాలు

వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన పప్పు శనగ ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి తుడిచిపెట్టుకుపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. క్వింటా పప్పుశనగ విత్తనాలకు రూ.7500, సేద్యానికి రూ.5 వేలు, విత్తనాలు విత్తేందుకు రూ.5 వేలు, పురుగుమందులు, బలం మందులకు రూ.5 వేలు, కౌలుకు రూ.5 వేలు.. ఇలా ఎకరాకు రూ.20–రూ.27 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతినడంతో పెట్టుబడి మొత్తం నీటిపాలైందని, అప్పులపాలవు

పరిహారంపై దిగులు

రబీ సీజన్‌కు సంబంధించిన ఈ క్రాప్ నమోదును గిద్దలూరు నియోజకవర్గంలో ఇటీవలే ప్రారంభించారు. ఈ క్రాప్ ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సాగనుంది. అయితే శనగ సాగు చేసిన నెల రోజులకే వర్షం కారణంగా పంట దెబ్బతినడంతో దున్నేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. పంట నష్టం మంజూరుపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శనగ దెబ్బతిన్నందున గ్రామాలను యూనిట్‌గా తీసుకుని నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం శనగకు ఇన్సూరెన్స్ ప్రీమియం ఎకరాకు రూ.368గా నిర్ణయించడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచితంగా పంట బీమా చేసిన విషయాన్ని గుర్తు చేసుకుని కూటమి సర్కారు తీరుపై మండిపడుతున్నారు. రబీ పంటల ఇన్సూరెన్స్ ప్రీమియం గడువు కూడా ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. ఇప్పటికీ వేలాది మంది రైతులు ప్రీమియం చెల్లించేందుకు విముఖత చూపుతున్న నేపథ్యంలో నష్ట పరిహారంపై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఈ క్రాప్ బుకింగ్ చేస్తూనే, ఎన్యుమరేషన్ పూర్తి చేయడం కష్టమవుతుందని, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందేనని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఏనాడూ ఇంత నష్టం చూడలేదు



ఎన్నో ఏళ్లుగా పప్పుశనగ పంట సాగు చేస్తున్నాం. ఏనాడూ ఇంతటి నష్టం చూడలేదు. ఐదారు రోజులు వర్షం విడవకుండా పడటంతో ఐదు ఎకరాల పంట పూర్తిగా దెబ్బతింది. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– కంకర నారాయణరెడ్డి,

పంట పూర్తిగా పోయింది



నేను పది ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. వర్షాలు అధికమవడంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఒక్కో ఎకరానికి ఇప్పటికే రూ.25 వేలు పెట్టుబడి పెట్టాం. ఏఓ, ఏడీఏ ఎండిన పంటలను పరిశీలించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నష్టపరిహారం అందించాలి.

– రెడ్డి నాగేశ్వరరెడ్డి, ఆర్.కొత్తపల్లె

నష్టపరిహారం అందించాలి



పప్పుశనగ పంట సాగు చేసిన ప్రతి రైతుకు నష్టం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించారు. మా గ్రామంలో ఒక్కొక్కరు 5 ఎకరాలకు పైగానే శనగ సాగు చేశారు. నేను ఐదు ఎకరాలకు రూ.లక్ష ఖర్చు చేశాను. తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయాం.

– ఆర్ చిన్నకాశిరెడ్డి, ఆర్ కొత్తపల్లె

సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన తహసీల్దార్, ఎంపీడీఓ

మార్కాపురం రూరల్: ఈనెల 14వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ పనిచేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని గ్రహిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన సామగ్రి వివరాలను సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ శ్రీనివాసులు, ఎన్నికల పీఓలు, ఏపీఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని నీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి పేర్కొన్నారు. పీఓలు, ఏపీఓలకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో దరఖాస్తులు ఎలా పూర్తి చేయాలో వివరించారు. మండలంలోని మొత్తం 13 చెరువులకు సంబంధించిన ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. శిక్షణలో ఎలక్షన్ డీటీ రామనారాయణరెడ్డి, ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి రూరల్: సాగు నీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని రామాపురం, ఏలూరు, తీగదుర్తిపాడు, పొదిలి చిన్న చెరువు, పెద్ద చెరువు సాగు నీటి సంఘాల ఎన్నికలను 14వ తేదీన సజావుగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి సంఘాలనికి ఆరుగురు సభ్యులను ఎన్నుకున్న తర్వాత, వారిలోనే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాలని సూచించారు. తొలుత అందరి ఏకాభిప్రాయంతో సభ్యుల ఎన్నికకు అధికారులు చర్యలు చేపడతారని చెప్పారు. ఏకాభిప్రాయం కుదరని పక్షంలో రహస్య ఓటింగ్ విధానంలో ఎన్నుకుంటారన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పొదిలిలో శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి



గిద్దలూరు : మాట్లాడుతున్న తహసీల్దార్ అంజనేయరెడ్డి

వైఎస్సార్ సీపీ రైతు ధర్నాను విజయవంతం చేయండి

- 13న ఒంగోలుకు అన్నదాతలు, పార్టీ శ్రేణులు తరలిరావాలి
- మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



అన్నా రాంబాబు

మార్కాపురం: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 13న ఒంగోలులో నిర్వహిస్తున్న ధర్నాకు మార్కాపురం నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో రైతులు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ 6లో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను నిర్మూలించాలన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. వివిధ పంటల్లో తేమ లెక్కలతో ప్రభుత్వమే రైతులను ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన విధంగానే రైతులకు ఆర్థిక భారం లేకుండా ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, ఇన్సూరెన్స్ కంపెనీలకు బీమా నగదును రైతుల పక్షాన ప్రభుత్వమే చెల్లించాలన్నారు. రైతులపై అదనపు భారం మోపే చర్యలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహిస్తున్న ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు.


భూ సమస్యలు పరిష్కరించుకోండి



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

కంభంలో: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభల్లో రైతులు తమ భూ సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ సూచించారు. మండలంలోని రావిపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ గ్రామ సభలో 14 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కిరణ్, డీటీ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బోడపాడులో సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై అంకమరావు, గ్రామస్తులు

మార్కాపురం రూరల్: మండలంలోని బోడపాడు గ్రామంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన మూడు సీసీ కెమెరాలను బుధవారం మార్కాపురం సీఐ సుబ్బారావు ప్రారంభించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. సీఐ వెంట రూరల్ ఎస్సై అంకమరావు, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం



మార్కాపురంలో గీతా శ్లోకాలు పఠిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు, భక్తులు


మార్కాపురం టౌన్: గీతా జయంతి పర్వదినాన్ని బుధవారం మార్కాపురం పట్టణంలోని అమ్మవారిశాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుపతి ఇస్కాన్ ప్రతినిధి ప్రభుదాస్ బృందం ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాలు, మహాభారత అధ్యాయాలను భక్తులతో పారాయణం చేయించారు. భగవద్గీత విశిష్టత, ఆధ్యాత్మిక జ్ఞానం ఎలా పొందవచ్చో వివరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 108 మందికి భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఏకాదశి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

గిద్దలూరు రూరల్: గీతా జయంతి సందర్భంగా బుధవారం గిద్దలూరులోని కుసుమ హరనాథస్వామి మందిరం ఆవరణలో భక్తులు గీతాపారాయణం చేశారు. భగవద్గీతలోని 700 శ్లోకాలను పఠించారు. ప్రతి ఒక్కరు గీతలోని సారాంశాన్ని గ్రహించి జీవితాన్ని ఆనందదాయకం చేసుకోవాలని ఆధ్యాత్మికవేత్తలు సూచించారు.



గిద్దలూరులో గీతాపారాయణం చేస్తున్న భక్తులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లు

మార్కాపురం: మార్కాపురం టౌన్, రూరల్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ జడీ లాజరస్ మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, తోటివారిపై దయ, ప్రేమ కలిగి ఉండాలని కోరారు. క్రిస్మస్ కేక్ కటింగ్, ప్రార్థనల అనంతరం 200 మంది పాస్టర్లకు దుస్తులు అందించారు. పాస్టర్ కందుల దేవదానం, హోలి స్పిరిట్ ఆడియో మినిస్ట్రీ వ్యవస్థాపకులు టి.సత్యంబాబు, కర్నూలు చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ తదితరులు ప్రసంగించారు. విశ్రాంత విద్యుత్ ఈఈ ప్రసన్న కుమార్, పాస్టర్లు ఆర్.చంద్ర, జార్జి బాబు, దేవదానం, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.